సజావుగా మాక్ డ్రిల్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విశాఖపట్టణం ఒన్ టౌన్ పరిధిలోని రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల వద్ద బుధవారం సాయంత్రం సివిలియన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హరిందిర ప్రసాద్, పోలీసు అధికారులు పర్యవేక్షణలో జరిగింది. సివిలియన్ మాక్ డ్రిల్ లో ఎస్.డి.ఆర్.ఎఫ్., ఎన్.డి.ఆర్.ఎఫ్., అగ్నిమాపక, పోలీసు, సివిల్ డిఫెన్స్, జీవీఎంసీ, రెవెన్యూ, కేజీహెచ్, సివిల్ సప్లై విభాగాల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర-అనందపురం : మండలం బోయపాలెం జాతీయ రహదారి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఆనంద పురం సీఐ సిహెచ్ వాసు నాయుడు తెలిపిన వివరాల ఇలా... విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామానికి చెందిన పోలిపల్లి. రామలక్ష్మి (45) అనే మహిళ తన మేనల్లుడు బి. మొయిదా యోగి (24)తో కలిసి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం నుంచి విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామానికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వారు బోయపాలెం జాతీయ రహదారి వద్దకు చేరుకునేసరికి వెనకనుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో రామలక్ష్మి తలకు బలమైన గాయాలయ్యాయి వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆనందపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే రామలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు మేనల్లుడు యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ.సిహెచ్. వాసు నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా కసిరెడ్డి



విశాలాంధ్ర-గాజువాక : గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శిగా కసిరెడ్డి సత్యనారాయణతో పాటు మరో 15 మంది సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ అభినందించారు. ఈ నూతన కార్యవర్గం ఎన్నికల్లో చోటు దక్కించుకున్న వారందరికీ పార్టీ శ్రేణులు అభినందనలతో పాటు తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశాయి.

జమ్మలమడుగు అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జ్‌గా పాసర్ల

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ సింహాచలంలో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ తరపున పాసర్ల ప్రసాద్ కడప పార్లమెంట్ నియోజక వర్గం అయినటువంటి, జమ్మలమడుగు అసెంబ్లీ ఎన్నికల ఇంచార్జ్ గా నియమించ బడ్డారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. అందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకురాలకు కృతజ్ఞతలు పాసర్ల చెప్పినట్లు తెలిపారు.

తర్లువాడ రైతుల భూములు వారికే కేటాయించాలి

ఏఎంసీ డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఆనందపురం మండలం, తర్లువాడ పంచాయతీ, తర్లువాడ ఎస్సీ గ్రామంలో సుమారు 50 సంవత్సరాల క్రితం 50 ఎస్ సి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవడం అన్యాయం అని, వారికి తిరిగి ఇవ్వాలని ఏఎంసీ (అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ) కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సొసైటీ కార్యవర్గ సభ్యులు బొడ్డు కళ్యాణ్‌రావు, ప్రభాకర్ జె.వి, మద్ది చంటి తర్లువాడ గ్రామాన్ని సందర్శించి బాధితులకు అండగా నిలిచారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూమిమీద, ఆ ఫల సాయం మీద ప్రస్తుతం 200 ఎస్సీ కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములపై కన్నువేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. వారు సాగుచేస్తున్న భూమిలో కొంత భాగాన్నికే పట్టాలు ఇచ్చి మిగతా దాన్ని వేరువేరు సర్వే నెంబర్లు చూపిస్తూ దానిని అక్రమంగా ఆక్రమించుకున్నారని తహసిల్దార్, ఆర్డీవోలు తప్పుడు నివేదిక ఇచ్చారన్నారు. దీనిపై అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి గ్రామస్తులందరూ వచ్చి ఫిర్యాదు చేయగా ఏఎంఎస్ కమిటీ సభ్యులు తర్లువాడ గ్రామంలో గ్రామసభ నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కి దీనిపై ఫిర్యాదు చేసి పరిష్కారించే దిశగా క్రృషి చేస్తామన్నారు. కోలా హరిబాబు, బి.గౌతమ్ బాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలలో భాగస్వాములు కావాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర-గాజువాక : ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఐ శ్రేణులు ప్రజా పోరాటాలలో భాగస్వాములు కావాలని విశాఖ జిల్లా సిపిఐ కార్యదర్శి ఏం పైడిరాజు అన్నారు. బుధవారం పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో సిపిఐ గాజువాక నియోజక వర్గ మహాసభ పల్లేటి పోలయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పైడి రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజలు నిత్యం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం సిపిఐ శ్రేణులు ప్రజా పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. విశాఖ నగరంలో జనసాంద్రత పెరగడం, ప్రధాన రహదారుల్లో ఫ్లైఓవర్‌లు నిర్మించక పోవడంవల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, రోజురోజుకు కాలుష్య సమస్య పెరిగిందని, కాలుష్య సమస్య నియంత్రణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన కాలుష్యం వల్ల ప్రజా ఆరోగ్యం దెబ్బ తింటుందని అన్నారు. అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ 5 లక్షలు రుణం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు. మరో అతిథి సిపిఐ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడో సారి అధికారం లోకి వచ్చిన ఈ పదకొండేళ్ళలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమయిందని అన్నారు .ప్రభుత్వ రంగం నిర్వీర్యం, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయని ఆరోపించారు. మరోవైపు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ మత ఘర్షణలకు ఆజ్యం పోస్తుందన్నారు. కాశ్మీర్, మణిపూర్. ఘటనలకు కేంద్రం మే కారణమన్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి గుణ పాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఇంకా ఈ మహాసభలో విశాఖ కో అపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జి. జనార్ధన్‌రావు, సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు,పెద పూడి దుర్గారావు, కె.పోతయ, కె.మాధవ రావు,ఎల్లేటీ శ్రీనివాస్, అప్పారీ విష్ణుమూర్తి, సోమేష్, పోలా రావు, పప్పు అప్పారావు, మహిళా సమాఖ్య నాయకురాలు కె. వనజాక్షి, పిల్లా సూర్య పద్మ పాల్గొన్నారు.

మహాసభ తీర్మానాలు ఇవే : గాజువాక నియోజకవర్గ మహాసభ పలు తీర్మానాలను ప్రవేశపెట్టింది. అవి ఇలా ఉన్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఉక్కు లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ,ఉక్కు నిర్వాసితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని, గంగవరం పోర్టులో గంగవరం గ్రామ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని సిపిఐ గాజువాక నియోజక వర్గ మహా సభ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు సహా పార్టీ నాయకులు ఏజె స్టాలిన్, కసిరెడ్డి సత్యనారాయణ ఇంకా సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు సి.పి.ఐ గాజువాక నియోజకవర్గ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

స్వాతంత్ర్య చరిత్రలో మహోజ్వల శక్తి అల్లూరి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి ఆంగ్లేయుల గుండెల్లో దడ పుట్టించిన మహా విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని భీమిలి జోన్ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. బీచ్ వద్ద ఉన్న అల్లూరి పార్క్ మరియు మండలపరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి నిలువెత్తు విగ్రహాలకు గంటా నూకరాజు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచ దేశాలలోనే మహోజ్వల శక్తిగా ఉన్న భారతదేశ సంపదను దోచుకోవడమే కాకుండా భారతీయులను బానిసలుగా చేసిన ఆంగ్లేయులను ఈ దేశం నుండి తరిమి కొట్టాలని కంకణం కట్టుకున్న స్వాతంత్ర్య సమరయోధులలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఒకరని అన్నారు. మహాత్మా గాంధీ లాంటి వారు శాంతియుత పోరాటం చేస్తే అల్లూరి లాంటి వారు హింసాత్మా పోరాటానికి ఆజ్యం పోశారని అన్నారు. నాడు అల్లూరి చూపిన మార్గంలో బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేయడానికి దేశమంతా గ్రామగ్రామాన యువకులు ముందుకు వచ్చారని అన్నారు. బ్రిటిష్ సైన్యం, వారి స్థావరాలపై ఎనలేని పోరాటం చేసిన అల్లూరి అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయారని అన్నారు. నేడు మన పిల్లలకు నాడు దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియపర్చవలసిన అవసరం ఉందని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చరకల రమణ, కాసరపు నాగరాజు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, జలగడుగుల మురళి, అప్పికొండ నూకరాజు, నొల్లి రమణ, సంకురుభుక్త జోగారావు, శీరపు మహేష్, అల్లిపిల్లి సతీష్, కృష్ణారావు మాస్టర్, అప్పికొండ నర్సింగరావు, శంకర్, చింతపల్లి నూకరాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడలపట్ల మక్కువ చూపడం ఎంతో విశేషం

- యువ నాయకుడు గంటా రవితేజ
- ఘనంగా ముగిసిన ఎం.సి.బి. క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఎంతో ప్రతిష్టాత్మకంగా మధురవాడ యువ క్రీడాకారులు పోతిన ఆనంద్, మణిగాం కుమార్,పిల్లా ఆనంద్ ఆధ్వర్యంలో గత పది రోజులపాటు మధురవాడ, బోట్టవానిపాలెం ఫారెస్ట్ లేఅవుట్ మైదానంలో జరిగిన ఎం.సి.బి. క్రికెట్ టోర్నమెంట్ (పిల్లా బంగారయ్య మెమోరియల్ సౌజన్యంతో) ఘనంగా ముగిసింది. మంగళవారం విజేతలకు ట్రోఫీ మెమొంటాలను ప్రధానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 32 ప్రధాన జట్లు పోటీపడిన క్రికెట్ మ్యాచ్‌లలో ఎం.సి.బి.టైటిల్ విజేత మరిడిమాంబ-11 పెందుర్తి, ద్వితీయ స్థానాన్ని పండా అడ్డా-11 మధురవాడ జట్టు కైవసం చేసుకుంది. బెస్ట్ బ్యాట్స్ మాన్&మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అప్పారావు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కాట్ రోల్ తమ ఉత్తమ ప్రదర్శనతో ట్రోఫీలను అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ నాయకుడు గంటా రవితేజ హాజరై విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా గంటా రవితేజ మాట్లాడుతూ ఈతరం యువత క్రీడల పట్లమక్కువ చూపడం ఎంతో విశేషమన్నారు. ఆరోగ్యవంతమైన ఆటలతో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం శుభ పరిణామమని అన్నారు. మధురవాడ ప్రాంత క్రికెట్ క్రీడాకారుల కోరిక మేరకు మధురవాడ క్రికెట్ స్టేడియంలో లిమధురవాడ క్రికెట్ క్లబ్‌లి ను ఏర్పాటుకు కృషి చేస్తానని గంటా రవితేజ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, వాండ్రాసి అప్పలరాజు, పిల్లా నరసింగరావు, నాగోతి వెంకట సత్యనారాయణ (జపాన్), జగదభి రామ కన్స్ట్రక్షన్స్ అధినేత నక్కా శ్రీధర్,మామిడి దుర్గారావు, కె.వి.ఆర్ ఈవెంట్స్ గురునాథ్, కనకదుర్గ ఈవెంట్స్ కొర్రాయిసురేష్, కానూరి అచ్యుతరావు,బగాధి లక్ష్మణరావు, సుబ్బరాజు, ఎండి అహ్మద్, జగ్గుపిల్లి నరేష్, బోయి శ్రీకాంత్, పొట్నూరు యశ్వంత్, బైపిల్లి ప్రసాద్, పోతన ప్రసాద్‌అనూష క్యాటరింగ్, చిన్నం నాయుడు, కనకాల భార్గవ్, హరి, రామిరెడ్డి, క్రాంతి, కృషన్, మోహన్ ఎం.ఎస్.డి. తదితరులు పాల్గొన్నారు.

మృతుల బంధువులకు వైసీపీ తరపున రూ.2 లక్షల పరిహారం పంపిణీ

విశాలాంధ్ర-పీఎం పాలెం : చందనోత్సవం రోజున జరిగిన దుర్ఘటనలో మరణించిన మృతుల ఒక్కొక్కరి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ తరపున రెండేసి లక్షల చొప్పున అందజేశారు. మాజీ ముఖ్య మంత్రి, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్రెడ్డి అదేశాల మేరకు సింహాచలం చంద నోత్సవం రోజున జరిగిన దుర్ఘటనలో మరణించిన చంద్రంపాలెం గ్రామానికి చెందిన పిల్లా ఉమా మహే శ్వరరావు శైలజ దంపతుల కుటుంబ సభ్యులు తల్లి దండ్రులు పిల్లా అప్పల నాయుడు, శాంత పెద నాన్న రాంబాబు గార్లకు ఒక్కొక్కరి రెండు లక్షల చొప్పున మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్ నాథ్,విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు కె.కె.రాజు,భీమిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) అందించారు. ఈ కార్యక్రమంలో 5,6,7,8 వార్డుల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు పోతిన హను మంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెసు జిల్లా నాయకులు పిల్లా సూరి బాబు, పిల్లా పాపారావు, వాండ్రాసి రవి కుమార్, పిల్లా సుజాత, బోని శివరామకృష్ణ, వంకాయల మారుతి ప్రసాద్, జగుపిల్లి నరేష్, రాజేశ్వరి, పోతిన పైడిరాజు,పిల్లా పోత రాజు, జగుపిల్లి అప్పారావు, మగ్గూరి వెంకటరావు, పిల్లా రమణ, దుక్క వరం,పిల్లా సన్యాసిరావు, బంగారు ప్రకాష్,బెల్లపు పాపారావు, టి.వరలక్ష్మి, గరె నాగేశ్వర రావు,పోతిన కనకరావు, పిల్లా రాజు, పొట్నూరి హరి కృష్ణ,పిల్లా శ్రీను,పిల్లా సురేష్, వాండ్రాసి వినోద్, నాగోతి ధర్మరాజు, బోగవిల్లి అశోక్, పొట్నూరి వాసు, దుర్గాశి మణి కంఠ, బూరాడ వేణు, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాటితూరును సందర్శించిన బీహార్ రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ అభిషేక్ రంజన్

విశాలాంధ్ర-తగరపువలస : బీహార్ రాష్ట్ర మత్స్య శాఖ డైరెక్టర్ శ్రీ అభిషేక్ రంజన్ ఐఏఎస్ వారి బృందం భీమునిపట్నం మండలం తాటితూరు గ్రామం నందు సాంప్రదాయ స్వదేశీ మత్స్యకారులను కలిసి స్థానికంగా చేస్తున్న మత్స్య సాగులో మెలకువలు, రవాణా, వ్యాపార సూత్రాలు, వారి జీవన విధానం అడిగి తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం తాటితూరు గ్రామం నందు రైతు సేవా కేంద్రంలో స్థానిక మత్స్యకారులతో జరిగిన సదస్సులో వారు పాల్గొన్నారు. తాటితూరు స్వదేశీ మత్స్యకార సహకార సంఘం ప్రెసిడెంట్ సింగిడి అప్పలరాజు మరియు పాలకవర్గం సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించారు. విశాఖపట్నం జిల్లా మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు మత్స్యకార సహకార సంఘం యొక్క నియమ నిబంధనలు, కార్యకలాపాలు, విధి విధానాల గురించి వివరించారు. స్థానిక స్వదేశీ మత్స్యకారులు చేపల సాగు చేయు పద్ధతులను, ఎదుర్కొనే సమస్యల గురించి బీహార్ రాష్ట్ర మత్స్యశాఖ అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. తదుపరి మంగమరిపేట వద్దనున్న ఆర్జిసిఏను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జేడీ కె.ఫణి ప్రకాష్, ఏ కె రెడ్డి, అవంతి నైపుణ్యత శిక్షణా కేంద్రం అధికారి, ఎమ్. విజయ కృష్ణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు, విశాఖపట్నం, డి. లావణ్య, మత్స శాఖా అభివృద్ధి అధికారి, భీమిలీ, గ్రామ మత్స్య సహాయకులు సుమంజలి, మానుష, మత్స్యకార సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భారతదేశం జోలికొస్తే ఖబడ్దార్ : ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి : భారతదేశ జోలికొస్తే ఖబడ్దార్ అంటూ జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాకిస్తాన్ తో పాటు ఉగ్రవాదులను హెచ్చరించారు. బుధవారం తెల్లవారు జామున పాకిస్తాన్లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసి ధ్వంసం చేయడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యే పంచకర్ల ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు పెందుర్తి పీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు మోడీ నాయకత్వంలో భారత సైన్యం గట్టి బుద్ధి చెప్పిందని, సైనిక చర్యకు మద్దతుగా దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని వెల్లడించారు భవిష్యత్తులో అటు పాకిస్థాన్ ఇటు ఉగ్రవాదులు భారత్ వైపు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేరని పేర్కొన్నారు. సైన్యం సహస చర్యకు మద్దతుగా ప్రజలందరూ నిలబడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ఎన్డీఏ నాయకులు కరకదేముడు వేగి దివాకర్ ఆర్ఎస్ నాయుడు గొర్లె అప్పారావు గల్లా శ్రీనివాసరావు అయితి సింహాచలం రాపర్తి కిషోర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ అపార్టుమెంట్ల నిర్మాణానికి సర్వే

వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర-విశాఖ : విశాఖ నగర పరిసర ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు నగర పరిధిలో బడ్జెట్ హౌసింగ్ అపార్టుమెంట్లను నిర్మించనున్నామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. నగర పరిధిలో సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం మధ్య తరగతి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అపార్టుమెంట్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించి ప్రజలు తమ ఆసక్తి, ప్రాధాన్యతలను తెలుసుకునేందుకు సమగ్ర సర్వే చేపట్టామని తెలిపారు. ఈ సర్వే ఆధారంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. దీనికోసం క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రకటన బోర్డులను నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీన్ని స్కాన్ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

అల్లూరికి విప్లవ జోహార్లు అర్పించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-పెందుర్తి : మన్యం వీరుడు విప్లవ ధీరుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ పెందుర్తి ఏరియా నాయకులు ఘన నివాళులర్పించారు. సిపిఐ పెందుర్తి మండల ఏరియా సమితి ఆధ్వర్యంలో సుజాతనగర్ సిపిఐ కార్యాలయం, భగత్ సింగ్ భవన్‌లో "స్వాతంత్ర్యం మన హక్కు అంటూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిన దించిన పోరాట సమర యోధుడు, బ్రిటీషు పాలకులను ముచ్చెమటలు పట్టించిన అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి సిపిఐ మండల సమితి కార్యదర్శి ఆర్ .శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాస్, ఎ.ఐ.వై.ఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు మాట్లాడుతూ 1922-1924 మధ్యలో గిరిజన ప్రాంతాల్లో బ్రిటీషర్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విప్లవం అవసరమని భావించి గిరిజనుల హక్కులకై ఉద్యమాన్ని రగిల్చి బ్రిటీషర్లను 2 సంవత్సరాలపాటు ముప్పుతిప్పలు పెట్టించారని గుర్తుచేశారు. 27 ఏళ్ల పిన్న వయస్సులోనే ఇదే రోజున బ్రిటీషు పాలకుల తుపాకీ గుళ్ళకు ఎదురెళ్లి ప్రాణాలర్పించారని చెప్పారు. అల్లూరి స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కులకై సమరశీల పోరాటాలకు యువకులందరూ నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సుజాత నగర్ శాఖ కార్యదర్శి ఎన్ ఆసిరినాయుడు, ఏఐవైఎఫ్ నాయకులు హరీష్, రాజు, సానుభూతి పరులు అప్పారావు, సూరిబాబు, వెంకటేష్, పైడిబాబు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించిన గంటా

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి నియోజకవర్గంలో ప్రధాన రోడ్లను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్‌తో కలిసి బుధవారం సందర్శించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని వి.ఎం.ఆర్.డి.ఎ. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఏ రోడ్లు ఎంత వెడల్పు విస్తరించాలి. ఎక్కడెక్కడ ఎలైన్మెంట్లను మార్చాలన్నది పరిశీలించారు. భీమిలి బీచ్ రోడ్డు, పాత అడవివరం, సత్తరువు, ఆనందపురం, పెద్దిపాలెం, దొరతోట, నేరెళ్లవలస జంక్షన్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే ఆయా జంక్షన్‌లలో రద్దీకి తగ్గట్టు మెరుగైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు వెడల్పు, ఎలైన్మెంట్ డిజైన్ చేయాలని సూచించారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వచ్చే నాటికి ట్రాఫిక్ రద్దీని తట్టుకునేలా రోడ్ల నిర్మాణం జరగాలన్నారు. వి.ఎం.ఆర్.డి.ఎ. జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా టి.వనజ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆపరేషన్ విభాగం డైరెక్టర్‌గా టి వి.సూర్యప్రకాష్, ప్రాజెక్టు విభాగం డైరెక్టర్‌గా టి వనజలను నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్ళపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా టి వనజ బుధవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1984లో ఏపీఎస్‌ఈబి కేటీపీఎస్ లో అసిస్టెంట్ ఇంజనీర్ గా చేరిన వనజ వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెూదాలో 2022లో పదవీ విరమణ చేసారు. 37 ఏళ్ళపాటు విద్యుత్ సంస్థలలోని అన్ని విభాగాలలో సేవలందించగా అందులో 17 ఏళ్ళు జీఎం, సిజీఎం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి వివిధ హెూదాలలో కొనసాగారు. 2024లో ఐదు నెలలు ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తించారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలలో పనిచేసిన అనుభవంతో ఈపీడీసీఎల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వనజ ను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అభినందించారు. సంస్థ సీజీఎంలు, ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు వనజను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

సజావుగా పది, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 19 నుండి 28వ తేదీ వరకు జరగబోవు పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు, 12వ తేది నుండి 17వ తేదీ వరకు జరగబోవు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు, జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19వతేది నుండి 28వ తేదీ వరకు జరగబోవు పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు, 12వతేది నుండి 17వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరపు పబ్లిక్ థియరీ మరియు ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో జరగనున్నందున, నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు, జివిఎమ్‌సి, వైద్య ఆరోగ్య శాఖ, ఎపిఎస్ఆర్‌టి.సి., విద్యుత్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టి అశోక్ చక్రవర్తికి ముఖ్యమంత్రి ప్రశంసలు

విశాలాంధ్ర-తగరపువలస: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈమధ్యే జరిగిన జన్మదినాన్ని పురస్కరించుకుని కొందరు వ్యవస్థాపకులు బృందం ముఖ్యమంత్రి కార్యాలయం, అంధ్ర రాష్ట్ర సచివాలయం సందర్శించి ముఖ్యమంత్రి కేన్వాస్ పెయింటింగ్ ఇవ్వడం జరిగింది. ఎనిమిది అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల పొడుగు గల్గిన ఈ పెయింటింగ్ నారా చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితంలో ఎనిమిది ముఖ్య ఘట్టాలని ప్రతిబింబిస్తుంటుంది. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా తగరపువలస వ్యక్తి చెట్టి అశోక్ చక్రవర్తి, ఫౌండర్, ఎక్సానిక్స్, ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఇతరు బృందంలో ఆర్ ఎస్ విన్నీ పాత్రో, కోఫౌండర్ & సీఈఓ, రికార్డైన్, రాజా రమేష్, చైర్మన్, వెగ్గ అప్సోల్ ప్రైవేట్ లిమిటెడ్, వెంకటేశ్వరులు. కే, సీఈఓ స్కాప్ విశ్వనాథం ఎదురు, మ్యానేజింగ్ డైరెక్టర్, విశ్వనాధ్ సంస్థ, తమిళనాడు నుండి చిత్రకారులు ఆనంద్ టీఏ, దినేష్ కుమారన్ ఉన్నారు. అలానే చిత్రకారులు ఇద్దరు ప్రత్యేకంగా నారా చంద్రబాబు నాయుడు యుక్త వయసులో అప్పటి ముఖ్యమంత్రిగా అలానే నేటి మేటి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికై నేడు తనతో తానే పోటీ పడ్తున్నట్టు ప్రతిబింబించేలా ప్రత్యేక కేన్వాస్ పెయింటింగ్‌ని కూడా ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి చిత్రకారులని, ఇతర బృందాన్ని ప్రశంసించారు.

9న ఇందుకూరుపేటలో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర-దేవీపట్నం : శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మతం విజయభాస్కర్లు ఇందుకూరుపేట వెలుగు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నియోజకవర్గంలో మండలల వారీగా నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమనికి అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని మండలంలో ప్రజలందరూ తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలిపేందుకు సమస్యలు ప్రతి ఒక్కరూ రావాలని ఆయన కోరారు.

నేడు మధురవాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-మధురవాడ : శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు మధురవాడ సబ్ స్టేషన్ పరిధి 11కేవీ. వుడా కాలనీ ఫీడర్‌పై మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విధ్యుత్ ఏఈ పోలాకి శ్రీనివాస్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. పోర్ట్ కాలనీ, ఎన్. జీ. ఓ. కోలనీ, సుద్ద గెడ్డ ఏరియా, వాంబే కాలనీ, పోర్ట్ కాలనీ, శ్రీనివాస్ నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు. ప్రజలు ఈ విషయం తెలసుకొని సహకరించవలసిందిగా ఆయన తన ప్రకటనలో కోరారు.

భీమిలి జోనల్ కమిషనర్‌కు స్వాగతం పలికిన 1వ వార్డు జనసేన అధ్యక్షురాలు భువనేశ్వరి

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు బుధవారం అధికారికంగా విధుల్లో చేరిన సందర్భంగా జనసేన పార్టీ తరఫున ప్రత్యేకంగా స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 1వ వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి పాల్గొన్నారు. ఆమె స్వయంగా జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడుని సాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు పరిమి ప్రీతమ్, పండిరి తారకేశ్, ప్రసాద్, హైమ జనసైనికులు, వీరమహిళలు పాల్గొని కమిషనర్‌కు ఉత్సాహంగా స్వాగతం పలికారు.

మే 20వ తేదీన అఖిలభారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలి

దివిస్ యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేసిన సిఐటియు నాయకులు

విశాలాంధ్ర-తగరపువలస : కార్మికులకు నష్టం చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికులని బానిసలుగా చేయాలని చూస్తున్నాయని దీనిని అఖిల భారత కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ మే 20 తేదీన పిలుపునిచ్చాయని దీంట్లో భాగంగా ఈ ప్రాంతంలో దివిస్ యాజమాన్యానికి కూడా సమ్మె నోటీసువడం జరిగిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు 26000అమలు చేయడం లేదని ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేట్ పరం చేస్తున్నాయని స్టీల్ ప్లాంట్ పరిరక్షించాలి ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల్ని పర్మిట్ చేయాలి కనీస పెన్షన్ 9000 ఇవ్వాలి పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి నాయకులు ఎస్ అప్పలనాయుడు పంపాను సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవం

విశాలాంధ్ర-పెందుర్తి : జీవిఎంసి 94 వ వార్డు, వేపగుంట నాలుగు రోడ్ల కూడలిలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవము బుధవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 95 వార్డు కార్పొరేటర్, బిజెపి నేత ముమ్మనదేముడు ముఖ్య అతిథులుగా పాల్గొని కమిటీ సభ్యులతో కలిసి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దీపం, ధూపం వెలిగించి నైవేద్యం సమర్పించి పూజలు జరిపారు. అనంతరం కమిటీ సభ్యులు 2000 మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మహత్యాన్ని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ : పెదగంట్యాడ నెల్లి ముక్కు శ్రీశ్రీ గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాశీ విశ్వేశ్వర స్వామి కంచి కామాక్షమ్మ గాయత్రి మాత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332 సమాధి ఆరాధన మహోత్సవం ఘనంగా పూజా కార్యక్రమం జరిగింది ఈ ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు 75వ వార్డ్ కార్పొరేటర్ లక్ష్మీబాయి పులి రమణారెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారు కాలజ్ఞానం ప్రకారంగా ఆయన ఏదైతే చెప్పారు అదే జరుగుతుంది బ్రహ్మంగారి కాల జ్ఞానం ప్రకారం మనుషులు వింత మనసులో పుడతారని దేశంలో ఎన్నో వింతలు జరుగుతూ ఉన్నాయి. ఆయన చెప్పింది జరుగుతుంది . ఆయన పుట్టే టైంలో అన్ని జిల్లాల్లో అన్ని గ్రామాల్లో బ్రహ్మంగారి ఆలయాలు నిర్మిస్తారు. అలాగే ఈ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కాకూడదు పబ్లిక్ సెక్టర్ కొనసాగాలని ఈ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలు కలయాలని బ్రహ్మంగారిని ప్రార్థిస్తు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుందేసి మహేష్ రెడ్డి గుందేసి సత్య రావు శ్రీరామ్ ముద్దుర్తి శ్రీరామ్ మూర్తి కనితి అప్పలరాజు ద్వారపూడి గురునాథ్ ముద్దుర్తి సాంబ సిహెచ్ ఈశ్వరరావు డి సత్యం ఎం మణికంత కే హరి సిహెచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మేయర్‌ను కలిసిన బిసి సంఘం నాయకులు

విశాలాంధ్ర-విశాఖపట్నం : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మాజీ శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు, ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘం తరఫున బీసీ కులాలకు సంబంధించిన ప్రతినిధులు వినతి పత్రాలను మాజీ ఎమ్మెల్సీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆధ్వర్యంలో మేయర్ కు అందించారు. ఈ సందర్భంగా వెనుకబడిన కులాలలో ఉన్న వారికి జీవీఎంసీ తరఫున అందాల్సిన ఆర్థిక మరియు సంక్షేమ పథకాలను సకాలంలో అందించాలని, జీవీఎంసీ తరఫున సహాయ సహకారాలు అందించాలని వారు వినతిపత్రం ద్వారా మేయర్ ను కోరారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ వెనుకబడిన కులాల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని వారి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, అలాగే జీవీఎంసీ తరుపున బీసీ సంక్షేమానికి సంబంధించి ఆర్థికపరమైన ప్రయోజనాలను మరియు సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించడం జరుగుతుందని సంఘా నేతలకు మేయర్ హామీ ఇచ్చారు.

బాలల సమస్యల పరిష్కారానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర-మల్కాపురం : బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాలలపై జరిగే హింస మొదలైన సమస్యల పరిష్కారానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ- బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. చిన్నారులు కూడా జీవితంలో స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, పట్టుదల, దేశభక్తి అలవర్చుకోవాలని అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి. రమణ మాట్లాడుతూ బాలలు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటే మానవ హక్కుల సమితిని ఆశ్రయించవచ్చు అని అన్నారు. ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు ఉందని ఆయన తెలియజేశారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అధ్యక్షత వహించి, వేసవి శిక్షణా శిబిరంలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న జాతీయ సేవా పథకం అధికారులు ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవి వేసవి శిబిరాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో స్థానిక నాయకులు శ్రీమతి జగదాంబ, ప్రముఖ న్యాయవాది జి.కె.వి. రాజు, పెద్ద సంఖ్యలో చిన్నారులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో ఆరుగురు ఎంపిక

విశాలాంధ్ర-గాజువాక : రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్లో ఆరుగురు ఎంపికయ్యారు. అగనంపూడి సిడబ్ల్యుసిలో ఏ వన్ మాస్టర్ లార్డ్స్ అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 తేదీన ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయిలో వివిధ క్యాటగిరిలో ఎంపికైన 6గురు క్రీడాకారులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యఅతిథి గాజువాక రవాణాశాఖ అధికారి వి.విజయప్రకాష్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జి .ఆనంద్ బాలు మాట్లాడుతూ రాయపూర్ లో జరిగే జాతీయస్థాయిలో జరిగే కిక్ బాక్సింగ్‌లో ఈ క్రీడాకారులు విజయం సాధించాలని కొమ్మోజి అశోక్ అకాడమీ ప్రారంభించి 6 నెలలోనే 6ని రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలు శరీర ధృడత్వానికి ఎంతో దోహదపడుతుందని విద్యార్థులు కేవలం చదువుకే అంకితం కాకుండా క్రీడల్లో కూడా నైపుణ్యం చెందినట్లయితే ఆరోగ్యంగా చురుగ్గా ఉంటారని అన్నారు. జీవీఎంసీ వారు త్వరగా సమ్మర్ క్యాంపు ప్రకటించాలని కోరారు. ఏ వన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు జి పావని నాయుడు, తెలుగు మహిళా నాయకురాలు గోపిశెట్టి పద్మ, వైఎస్ఆర్సిపి మహిళా నాయకురాలు కె సుజాత, ఏ డి సి డైరెక్టర్ కొమ్మోజి భీష్మాచారి సీనియర్ క్రీడ కారుడు ఎం అప్పలనాయుడు మరియు కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

విశాలాంధ్ర-పద్మనాభం : అల్లూరి సీతారామరాజు పుట్టినటువంటి పాండ్రంగి గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి స్థానిక ఎంపీపీ కె రాంబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ గొప్ప జాతీయ నేత మన మండలంలో మన గ్రామంలో పుట్టడం ఎంతో సంతోషంగా ఉందని, ఆయన జీవితాన్ని ఒక స్ఫూర్తిగా తీసుకొని ప్రతి వ్యక్తి ముందుకు సాగాలని తెలియజేశారు. గెరిల్లా యుద్ధ తంత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారి బానిస సంకెళ నుంచి భారతదేశానికి స్వతంత్రం కోసం పోరాటం చేసి అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు విడిచారని ఆయన అన్నారు. అణగారిని జీవితాల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అనే ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక మాజీ పిఎసిఎస్ చైర్మన్ అముజూరి అప్పారావు,సత్యనారాయణ రాజు, స్థానిక గ్రామస్తులు అల్లూరి సీతారామరాజు అభిమానులు పాల్గొన్నారు.

చందన ప్రసాదం విక్రయాలు కోసం భక్తుల ఎదురుచూపు

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిర్మాల్య చందన ప్రసాద విక్రయాలు కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల జరిగిన స్వామివారి నిజరూప దర్శనం 364 రోజులపాటు స్వామివారిపై ఉన్న చందనం విసర్జన చేసిన సంగతి పాఠకులకు విదితమే. చందనం (ప్రసాదం) పది గ్రాములు భక్తులకు రూ.10/-లు ధరను ఆలయ అధికారులు నిర్ణయించారు. ప్రతి ఏడాది స్వామివారికి నాలుగు విడతలుగా మొత్తం 500 కేజీల చందనం సమర్పించటం (పోత పోయటం) జరుగుతోంది. కాని చందన విసర్జన జరిగేసరికి 90 నుండి 100 కేజీల లోపుమాత్రమే ఆలయ అధికారులకు లేక్కచేప్పటం జరుగుతోంది. గతంలో కొంతమంది కార్యనిర్వాహణాధికారుల హయాంలో 100 కేజిలనుండి 120 కేజిలోపు ఆధికారులు లెక్క కట్టి భక్తులకు ప్యాకింగ్ చేసి విక్రయాలు జరిపేవారు. కాని రాను రాను ఆ చందనం కాస్తా ఏడాది ఏడాదికి లెక్క తగ్గుతోంది. ఈ విషయంపై కొంతమంది వైదిక పెద్దలను వివరణ కోరగా వారు ఇటీవల కాలంలో పెరుమాళ్ అంతరాలయం లో నేతి దీపాల వేడికి స్వామిపై ఉన్న చందనం ఎండిపోయింది. గత ఏడాది 96 కేజీలు చందనం విసర్జన జరుగగా లభించింది. ఈ ఏడాది సుమారుగా 109 కేజీల చందనం విసర్జన జరిగిందని అందులోను పట్టువస్త్రంకు అంటుకునిఉన్న చందనము 8కేజీలు (పై లెక్కలో కలపటం జరగదు) వచ్చిందని సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్ వివి ఏసెస్ ప్రసాద్ తెలిపారు. ప్రతీ ఏటా ఒక ప్యాక్‌లో 10 గ్రాముల చందనం అమ్మటం జరుగుతోంది. ఆ స్వామివారి నిర్మాల్య చందన ప్రసాదం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారు. నగరంలో ఉన్న రెవెన్యూ, పోలిస్, ఇతర విభాగాల అధికారులు మాకు అన్ని ప్యాకెట్లు కావాలి, ఇన్ని ప్యాకెట్లు కావలి అంటూ వారి వారి అధికారిక లేఖలు పట్టుకుని దేవస్థానం అధికారుల చుట్టూ ప్రయత్నం చేస్తూ వారి పనులు వారు కానిస్తున్నారు.

ఇందువలన ఆలయ అధికారులు చందన విక్రయాలు అంటే మాకు తలనొప్పి అని అంటున్నారు. స్వామిపై ఉన్న చందనం అంతగా ఎండిపోవటం కలయ లేక విష్ణుమాయా అన్న విషయం తేలాల్సి ఉంది అని కొందరు ఉద్యోగులు, స్థానికులు అంటున్నారు. ఎంతపోని ఎండలు ఎక్కువైనా స్వామివారిపై ఉన్న చందనం సుమారు 400 కేజీలకు పైగా ఎండిపోవటం ఎంతవరకు సబబు అని ఉద్యోగులు గుసగుసలు ఆడుకుంటున్నారు. స్వామివరిపై ఉన్న చందనం నీటిలో కలుపుకొని త్రాగితే శరీర రుగ్మతలు రావని భక్తుల ప్రగాడ విశ్వాసం. అదేవిదంగా ఆచందనం నుదుటిపై బొట్టు పెట్టుకుని ఎక్కడికైనా, ఏదైనా కార్యంపై బయటకు వెళితే ఆకార్యామి దిగ్విజయంగా నేరవుతోందని భక్తుల నమ్మకం. అదేంటండి ఆపేపర్‌లో ఇలా, ఆటివిలో అలా అని భక్తులు ఎవరైనా అధికారులను అడిగితే అందుకు సంబంధిత అధికారులు ఆ పేపర్, మీడియా విలేఖరులకు వేరే పనేమీ లేదండి అంటూ ఎంతసేపు మా ఆలయం పైనే వార్తలు వ్రాస్తారు అని కార్యనిర్వాహణాధికారులను పక్క త్రోవ పట్టించిన సందర్భాలు ఉండవచ్చునేమో? ఒక వేలా ఏ ఉన్నతాధికారి అయినా స్వామివారి చందనంపై వచ్చిన వార్తలపై ఆరాతిస్తే ఆ అధికారికి, ఆయనతోపాటు వచ్చిన వారందరికి స్వామివారి చందనం ఇచ్చి వారిని శాంత పరచి, శాంతిచేసి సాగనంపటం జరుగుతోంది . అంత పవిత్రమైన చందనం పై ఆలయ ఉన్నతాధికారులు స్వామివారి చందనం పై ప్రత్యేక దృష్టి సారించాలని భక్రులతోపాటు ఉద్యోగులు స్థానిక భక్తులు కోరుకుంటున్నారు.

వైభవంగా వెంకటాద్రి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రి పై బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమములు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామి కళ్యాణం నిర్వహించగా 108 దంపతులు చేత శ్రీవారి కళ్యాణ ఉత్సవం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు మహర్తి శ్రీనివాసాచార్యులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈఓ నీలిమ సహా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా గురువారం శ్రీవారి ఆలయం నుండి చిన్నముసిడివాడ మీదుగా సప్తగిరి అలివేలుమంగా దేవి ఆలయం వరకు రదోత్సవం జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

ఉగ్రదాడులపై అప్రమత్తం చేస్తూ విశాఖలో సివిల్ మాక్ డ్రిల్

- ఒన్‌టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో రక్షణ విన్యాసాలు
- మాక్ డ్రిల్ ను పర్యవేక్షించిన ఎస్.డి.ఆర్.ఎఫ్. ఐజీ, కలెక్టర్, జేసీ ఇతర అధికారులు
- ప్రతి వార్డు సచివాలయ పరిధిలో ప్రదర్శనలు నిర్వహిస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం విశాఖపట్టణం నగరంలో బుధవారం పలు చోట్ల సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు ఇచ్చాయి. బుధవారం సాయంత్రం ఒన్ టౌన్ పరిధిలోని రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో వేర్వేరుగా నిర్వహించిన ఆపరేషన్లలో సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్.డి.ఆర్.ఎఫ్., ఎన్.డి.ఆర్.ఎఫ్., పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్య శాఖ, పలువురు వాలంటీర్లు భాగస్వామ్యమయ్యారు. ముందుగా రాణీబొమ్మ సెంటర్లో రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడులు చేయగా స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశాయి. వెనువెంటనే సంఘటనా స్థలానికి మాస్కులు ధరించి చేరుకున్న ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్. సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడారు. నిచ్చెన సాయంతో కొందరిని కిందకు దించగా, మరికొందరిని భద్రతా సిబ్బంది మెట్ల మార్గం ద్వారా కిందకుదించారు. ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. ఒన్ టౌన్ పరిధిలోని క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శనలు ఇస్తూ అప్రమత్తం చేశాయి. అలారం మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలో.. సేఫ్ జోన్ కు ఎలా చేరుకోవాలో తెలిపాయి. రోప్ ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి చూపించాయి. ఈ క్రమంలో ఎస్.డి.ఆర్.ఎఫ్. ప్రత్యేక వాహనంలో ఉండే పరికరాల వినియోగం, వాటితో ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవచ్చో ఎస్.డి.ఆర్.ఎఫ్. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్.డి.ఆర్.ఎఫ్. ఐజీ రాజకుమారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాల పనితీరు, వాహనంలో ఉండే వివిధ రకాల పరికరాల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు.

వలు చోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్ కార్యక్రమాలు.. నగరంలోని ఒన్ టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల, విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ పరిధిలో బుధవారం సాయంత్రం సివిల్ మాక్ నిర్వహించిన రక్షణ బృందాలు అదే రోజు రాత్రి కొన్నిచోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశాయి. ఉగ్రమూకలు అనుకోని రీతిలో చీకటిని సృష్టించి ప్రజలపై దాడులు చేసేందుకు పన్నాగం పన్నిన క్రమంలో రక్షక దళాలు ఎలా స్పందించాలి, ప్రజలు ఏ విధంగా వ్యవహరించాలి అనే కోణంలో ఒన్ టౌన్ ప్రాంతంలో, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ లో బుధవారం రాత్రి బ్లాక్ అవుట్ నిర్వహించాయి. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉగ్రమూకలు దాడులకు తెగబడితే ఏ విధంగా స్పందించాలి.. వ్యవహరించాలి అనే విషయంపై రక్షక దళాలు ప్రజలను అప్రమత్తం చేశాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాబోయే కొద్ది రోజుల్లో నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని, ఉగ్రదాడులపై ప్రజలను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఒన్ టౌన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగిన మాక్ డ్రిల్ సమయంలో మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై స్పందించారు. అనుకోని రీతిలో ప్రమాదం వాటిల్లితే ప్రజలు ఎలా స్పందించాలో ముందునుంచే అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. దానిలో భాగంగా నగరంలో పలు చోట్ల సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్ తో పాటు, బ్లాక్ అవుటు మాక్ డ్రిల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిజమైన ఘట్టంలో ఏ విధంగా అధికారిక బృందాలు, వైద్య బృందాలు వ్యవహరిస్తాయో తెలుపుతూ ప్రదర్శనలు ఇస్తున్నామని చెప్పారు. అగ్నిమాపక వాహనాలను, అంబులెన్స్ లను, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీములు, ఎమెర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని కలెక్టర్ వివరించారు. భవిష్యత్తులో అనుకోని ఘటనలు ఏవైనా జరిగినట్లయితే వాటిని సమర్ధంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు.

బీచ్ రోడ్ వైజాగ్ ఎక్స్ పోలో నయాగరా జలపాతం

టికెట్ ధరలో ప్రత్యేక తగ్గింపు

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఒక మరొక ప్రత్యేక ఆకర్షణ సిద్ధమైంది. బీచ్ రోడ్ లో పోలీస్ మెస్ వెనుక భాగంలో సువిశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్ పో లో నయాగరా జలపాతం నమూనా ప్రజలను అలరించడానికి సిద్ధమైంది. బుధవారం సాయంత్రం దీనిని నిర్వాహకులు ప్రారంభించారు. 30 అడుగుల ఎత్తు, 181 అడుగుల వెడల్పు కడిగిన నయాగరా జలపాతం నమూనాను ఎగ్జిబిషన్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పైనుంచి వేగంగా పడుతున్న నేటి ప్రవాహం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎంతగానో ఆకర్షిస్తోంది. వేసవి నేపథ్యంలో విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను, ముఖ్యంగా చిన్నారులను మరింత అలరించే విధంగా దీనిని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు రాజారెడ్డి తెలిపారు. ఇప్పటికే జలకన్యలతో విశాఖలో చిన్నారులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ వైజాగ్ ఎక్స్ పో లో వేసవి దృష్ట్యా సరికొత్త ఆకర్షణలతో నగరవాసులకు ఆహ్వానం పలుకుతోంది. టికెట్ రుసుమును 150 రూపాయల నుంచి కేవలం 100 రూపాయలకే పరిమితం చేసినట్లు తెలిపారు. ఎక్కువ శాతం మంది విశాఖవాసులు వీటిని వీక్షించడానికి వీలుగా ప్రవేశవంలో రాయితీ కల్పిస్తున్నారు. వైజాగ్ ఎక్స్ పో ప్రవేశ రుసుము, జలకన్యలు, కాశ్మీర్ సిటీ, నయాగరా జలపాతం అన్ని వీక్షించడానికి కేవలం 100 రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలందరికి సంతోషాన్ని, ఆనందాన్ని అందించే ఒక ప్రత్యేక ప్రాంగణంగా దీనిని తీర్చిదిద్దనట్లు చెప్పారు. చిన్నారులను ఎంతగానో ఆకట్టుకునే విభిన్న రైడ్లు మహిళలకు సైతం ఆకర్షించే వస్త్ర ఆభరణాల స్టాల్స్ కుటుంబ సమేతంగా సంతోషాన్ని పంచుకునే వేదికగా రుచికరమైన వంటకాలు తో విశాఖ ఎక్స్ పో నగరవాసులను సాదరంగా ఆహ్వానం పలుకుతోంది.

కాలిఫోర్నియా బాదంలో పోషకాల సమాహారం

విశాలాంధ్ర-విశాఖపట్నం : కాలిఫోర్నియా బాదంను ఆమె దినచర్యలో భాగం చేయడం తో మహిళల ఆరోగ్యం బాగుంటుందని ప్రముఖ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. గింజల రాజుగా పిలువబడే కాలిఫోర్నియా బాదం, ప్రోటీన్, జింక్, మెగ్నీషియం మరియు విటమిన్ ఇ వంటి 15 ముఖ్యమైన పోషకాలకు సహజ వనరు. ఆమె దినచర్యలో కొన్ని బాదం పప్పులను జోడించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటుగా, గుండె ఆరోగ్యానికి మద్దతు అందిస్తుంది. మెరిసే చర్మానికి, బరువు నిర్వహణకు మరియు శక్తిని అందించడంలో సహాయపడుతుందన్నారు. అమ్మ ఆరోగ్యానికి తోడ్పడేదాన్ని బహుమతిగా ఇవ్వడం ప్రతి మదర్స్ డేకి అమ్మ కోసం రుచికరమైన, పోషకమైన ప్రత్యేకమైన డెజర్ట్ తయారుచేయడం చేస్తానన్నారు. ఆరోగ్యాన్ని పెంచడానికి ఎల్లప్పుడూ కాలిఫోర్నియా బాదంపప్పులను కలుపుతానని. ఇప్పుడు మా అమ్మాయి కూడా నాలాగే ఆరోగ్యానికి మొదటి స్థానం ఇచ్చే బహుమతులను ఎంచుకోవడం ప్రారంభించింది" అని అన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-భీమిలి : భీమునిపట్నం శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం జయంతి ఉత్సవములు ఘనంగా జరిగినవి. ఉదయం 6 గంటలకు అమ్మవారి మూలవిరాట్ కు పంచామృత నారికేల ఫలరాస అభిషేకములు, 11 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపు మేళతాళములతో శాస్త్రోత్తముగా జరిగినవి. కార్యక్రమము వెలవలపల్లి సత్యసాయి శంకర్ శర్మ, పర్యవేక్షణలో జరిగినది. కార్యక్రమమునకు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పూసర్ల శ్రీనివాస్ కార్యదర్శి బొండా బాలాజీ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ముమ్మిడి శెట్టి సునీల్, కార్యదర్శి ఉసిరికల విశ్వేశ్వరరావు కోశాధికారి ఉసిరికల వెంకటేష్, వాసవి ప్రార్ధన మందిర ప్రతినిధులు బొండా కిరణ్, కంచర్ల కామేష్, ఆర్యవైశ్య ప్రతినిధులు అరిసెట్ల బద్రి నారాయణమూర్తి, పూసర్ల రమేష్, కొత్త రామకృష్ణ, గుగ్గిళ్ళ కృష్ణ శాస్త్రి, ఉసిరికల రాజేష్ కట్టమూరి వెంకన్న బాబు (వినయ్), పోలిశెట్టి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్లు విధిగా జోన్లలో పర్యటిస్తూ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి : నగర మేయర్



విశాలాంధ్ర-విశాఖపట్నం : జీవీఎంసీ జోనల్ కమిషనర్లు ప్రతిరోజు విధిగా ఆయా జోన్లలో పర్యటించి ప్రజలకు కల్పించివలసిన మౌలిక సదుపాయాలను, అందించవలసిన సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో అన్ని జోన్ల కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్లు ప్రజలకు అందించవలసిన మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు విధిగా వారి జోన్లలో పర్యటించి ప్రజల సమస్యలను, వారికి కల్పించవలసిన మౌలిక సదుపాయాలపై పర్యవేక్షించాలన్నారు. ప్రతి జోన్ లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి ఖాళీ స్థలాల పన్నులను విధించి జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టికి చర్యలు చేపట్టాలన్నారు. సహాయ వైద్యాధికారులు నిత్యం పారిశుధ్య నిర్వహణ లోపం కనిపిస్తుందని, ఇకపై నిత్యం పర్యవేక్షిస్తూ వార్డులు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని, వార్డు సచివాలయంలలోని సచివాలయ కార్యదర్శులు వారు నిర్వహించే విధులు పై అసంతృప్తి కనిపిస్తుందని వారి పనితీరుపై నిత్యం పర్యవేక్షిస్తూ వార్డుల అభివృద్ధికి జోనల్ కమీషనర్లు కృషి చేయాలన్నారు. అనధికార లేఔట్లలో అనధికార కట్టడాలను గుర్తించి వాటిపై తగిన చర్యలు చేపట్టి జీవీఎంసీకి ఆదాయ మార్గాలను చేకూర్చాలని ఆదేశించారు. ప్రతి వార్డులలో నిత్యం తాను పర్యటిస్తానని మేయర్ తెలిపారు. ఇప్పటివరకు అధికారులు, ఉద్యోగుల పనితీరు బాగు లేకుంటే మెరుగుపరుచుకొని పారదర్శకతో విధులు నిర్వహించేలా జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గెడ్డలోని పూడికలు వ్యర్థాలు తొలగించాలని, గెడ్డలను నిత్యం పరిశీలించి మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు చేసి నివేదిక అందించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

మెగా జాబ్ మేళాను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

విశాలాంధ్ర-పెందుర్తి : ఈనెల 9న, పెందుర్తి పీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని అధికారులు ఎన్డీఏ నాయకులు కార్యకర్తలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సూచించారు. మెగా జాబ్ మేళా నిర్వహణకు సంబంధించి నియోజవర్గం అధికారులు, ఎన్డీఏ ముఖ్య నాయకులతో బుధవారం సమీక్ష కార్యక్రమం నిర్వహించి మెగా జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు 40కు పైగా కంపెనీలు హాజరవుతున్నాయని 1500 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. మే 9న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా జాబ్ మేళాను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మేయర్ పేలా శ్రీనివాసరావులతో కలిసి తాను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు అన్ని రకాల వసతులు సమకూరుస్తామని, టీ స్నాక్స్ భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని పెందుర్తి నియోజకవర్గం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చోడవరం నియోజవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పి.వి.ఎస్.ఎన్.రాజు, పంచకర్ల ప్రసాద్ రావు, పంచకర్ల వెంకటేశ్వరరావు,జోన్ 6 జోనల్ కమిషనర్ సత్య శేషాద్రి , జోన్ 8 జోనల్ కమిషనర్ హైమావతి, పరవాడ ఇంచార్జ్ ఎంపీడీవో ధర్మారావు, సబ్బవరం ఎంపీడీవో పద్మజ, పెందుర్తి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కొల్లి వెంకట్రావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారులు చాముండేశ్వరరావు, గోవిందరావు,93 వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, టిడిపి సీనియర్ నాయకులు సేనాపతి శంకర్రావు, ఇందల రమణ 95 వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాట్ల మధు, కంచిపాటి మధు, 93వ వార్డ్ అధ్యక్షులు ఆది బాబు,94 వ అధ్యక్షులు పెన్నింటి పార్వతి, 96 వార్డ్ అధ్యక్షులు దాడి భోగలింగం నాయుడు, 98వ అధ్యక్షులు మజ్జి సూరిబాబు,79 వార్డు అధ్యక్షులు పిల్లా శివకృష్ణ, 77 వార్డు అధ్యక్షులు కాకి బాబు, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామనాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, కర్రీ కనకరాజు, ముత్యాలంపాలెం సర్పంచ్ సుజాత ముత్యాలు, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ,సీనియర్ నాయకులు పిల్ల జగన్మోహన్, బిగిడి రామ గోవింద్, కెఎస్ఆర్, గొన్నా రమాదేవి, నాగ సుధా, రాపర్తి కిషోర్, రావర్తి కృష్ణమోహన్, జుతాడ శ్రీను, లక్కీ గోవింద్, సదరం భీమేశ్వరరావు,గొర్ల అప్పారావు, త్రిబుల్ ఎక్స్ రమేష్, ఆర్ఎస్ నాయుడు, కోరుకొండ వరహాలు, మోటూరు చైతన్య తనకల శ్రీను, అంబటి వెంకటేష్ తదితర ఎండీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.